# మాయ

చుట్టూతా చీకటి...

చీకట్లోగూడా తలెత్తిన ఎత్తైన ప్రహరీలు...

"నిజానికి నేను దొంగనికాదు...అట్లాగని అబద్ధానికీ దొంగనుకాదు ..నా ఖర్మ కొద్దీ ఇక్కడికి వొచ్చాను ..."

"మొదట అందరూ అంతేలేభాయ్! ఇప్పటికి నాతలమీద ఉన్న వెంట్రుక లున్నన్ని మార్లు వొచ్చా నిక్కడికి ... ఇప్పటికీ నువ్వన్నమాటే నేనంటాను! మనం నిజంగా దొంగలంకాదు ... ఈ దొంగనాయాళ్ళ ప్రపంచంలో మటుకు దొంగలం! కావాలనిపించింది తీసుకోటం దొంగతనం మరి-ఈశ్వర దృష్టిలో! .. ఇంతకీ నీ పేరుకి చెప్పలేదు..."

"నారాయణ! రెండేళ్ళ క్రితం 'డిగ్రీ' పుచ్చుకున్నా! ఈరోజున 'దొంగ'నని బిరుదు పుచ్చుకున్నా. నిజమాలోచిస్తే 'డిగ్రీ' పుచ్చుకున్న నారాయణని ఎవరూ తలెత్తి చూడనివాళ్ళు. ఈ 'బిరుదు' పుచ్చుకున్న నారాయణని మాత్రం నోళ్లు తెరిచి, గుడ్లప్పగించి మెదడుకు పని కల్పించి మరీ చూస్తున్నారు ఏంటో అంతా మాయ! ఈ ప్రపంచంలో అంతా మాయ రాజ్యమేలుతోంది...మరి నీపేరు ఏమిటి?" అడిగాడు నారాయణ

"నాపేరు కేశవులు అంటారు... కొందరు కేశవరావ్ . ఇంకొందరు కేసవా... అనీ అంటారు...అవునుగానీ నువ్ చేసిన మాయపని ఏమిటి గురూ!" కేశవులు ఆసక్తిగా అడిగాడు

"అనాదిగా భూమి పుట్టినప్పట్నుంచీ జరుగుతున్న మామూలే!..."

"ఇవాళ సాయంత్రం నాకు గుర్తొచ్చింది – 'నా ఆకలికితోడు యింట్లో నాతల్లీ చెల్లీ కూడా మూడ్రోజులుగా అంతగా వుంటున్నారని! జీవితం అంటే ఏమిటో మొదటిసారిగా అర్థమయ్యింది. గానీ ఈ లోకంలో మాయ ఎలా రాజ్యమేలుతోందో మటుకు అర్థంకాలేదు ఎలాగయినా కనీసం గంజికయినా సరిపడ డబ్బులు సంపాదించాలని అనుకున్నా. కూలికి ఓపికకూడా లేకుండా పోయింది ..." నారాయణ ఆగాడు. చిన్నగా నవ్వాడు.

"హుం! చూశావా? ఈ విషయాలన్నీ చెబుతూంటే కనీసం నాకు కన్నీళ్ళయినా రావటంలేదు... అసలు యిప్పుడు ప్రాణమంటూ ఉంటేగదా కన్నీళ్ళొచ్చేందుకు?"

"అసలుకథ చెప్పుగురో?" బట్టతల మీదున్న పాతిక వెంట్రుకల్నీ వేళ్ళతో దువ్వుకుంటూ విసుక్కున్నాడు కేశవులు

"ఉండుమరి! చెబుతున్నా... మరీ కొత్తగదా ఈ విషయాలకి, అందులో

'చంద్ర'

మొదటిసారాయె! అఁ!! సాయంత్ర మన్నాగదూ ."

"సాయంత్రం స్టేషనుకేసి వెళ్లాను... కూలీకి ప్రయత్నిస్తే లైసెన్సున్నవాళ్ళు గొడవ పెడతారని భయం వుంది... గానీ ప్రయత్నించాఁనుకున్నా! ప్లాట్ ఫారమ్మీద ఒళగా అటూ ఇటూ తిరిగా... గానీ లాభం లేకపోయింది... ఎర్ర డ్రెస్సుల్లో లైసెన్సువాళ్ళందరూ కప్పలూ, పాములూ తిన్న సైనికుల్లా, దసరా సరదాలకి మైసూర్లో అలంకరించిన ఏనుగుల్లా అనిపించారు. వాళ్ళలో ఒక్కగా ఉన్న ఏ ఒక్కరయినా చిన్న గుద్దు గుద్దితే ప్రాణం పోతుందేమో ననిపించింది. రైలు కదులుతూఁడగా దున్నపోతులా వున్నోకడు నల్లకోటులో పరిగెత్తుకూ వచ్చి నన్ను గుద్దాడు చాప చుట్టలా క్రిందకు విరుచుపడిపోయాను. లేచి నుంచునేంతలోనే వాడు నన్నూ, నా మొహాన్నీ తిట్టుకుంటూ, తిరిగి తిరిగి చూసుకుంటూ దాటిపోయాడు. మోకాలి చిప్ప రుద్దుకుందామని తొంగున్నవాణ్ణి మళ్ళీ తలెత్తి పైకి లేవాలనిపించలేదు. చటుక్కున చేయిచాచి పర్సు నందుకని జనంలోకి కలిసిపోయాను...

"ప్రపంచమంతా తగలబడిపోతూంటే భయంతో పరిగెత్తే ప్రజల్లాగా సందడిగా వున్నచోట పర్సుతెరిచి చూస్తే వందరూపాయల కట్టలున్నాయి. నాకప్పుడు ఒళ్ళంతా గడ్డకట్టుకుపోయి చలికి వణికిపోతున్న వాడిలా వొణికాను. కానీ గమ్మత్తు! అంత చలివణుకులోనూ స్నానం చేసినంతగా చెమటపట్టింది. గబుక్కున పర్సు పారేసి నోట్లు పాంటు జేబులోకి కుక్కుకుని గేటుకేసి పరిగెత్తా అక్కడా ." నారాయణ ఆయాసంగా కాస్సేపాగి

"అక్కడ నల్లకోటు దున్నపోతు గాడు 'అదుగో, వాడేనండి సార్ .వాడే! దొంగవెధవ పట్టుకోండి అన్నాడు. వెధవలు నాజేబు సోదాచేస్తే మటుకు అందులోంచి... ఆశ్చర్యం .నాకర్థంకాలా ఒకటో రెండో వంద రూపాయల నోట్లొచ్చాయి. 'మిగతావి ఏ'వన్నారు? ఇన్నాళ్ళ నాచదువూ, వెధవ డిగ్రీధర్మమా అని నిజంచెప్పినా బోడిముండావాళ్ళు నమ్మలా అందుకని ఇక్కడికి, ఈ కొట్లోకి నన్ను రవాణా చేశారు. కాని . అదేం మాయోగానీ మిగతా నోట్లేమయ్యాయో తెలీదు..."నారాయణతలని అడ్డంగా విదిలిస్తూ చెప్పటం ఆపాడు

"గంజి మాకు పెడతారు గావాల్నూ! గంటకొట్టారు పదపద! అయినా నాకేం తెలుసుగురూ నీ జేబులోవి దొంగ వంద రూపాయం నోట్లనీ!! వాటివి మారుస్తూంటే మాయ ముండాకొడుకులు నన్ను పట్టేశారు మరి!" చీకట్లోకి నడుస్తూ అన్నాడు కేశవులు.

ఇది విన్న నారాయణ మెదడునిండా చీకటి నిండుకుపోయింది.